సాక్షి ప్రకాశం

మంగళవారం । 12 । ఆగస్టు । 2025



విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి యువకుడు బలి

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం ఓ యువకుడి ప్రాణాలను బలిగొన్న ఘటన దర్శి పట్టణం నందువారిపాలెం వద్ద సోమవారం జరిగింది. - 8లో..



హత్య కేసులో నిందితుడిపై హత్యాయత్నం

హత్య కేసులో నిందితుడుగా ఉన్న వ్యక్తి కోర్టుకు హాజరై తిరిగి వెళ్తుండగా ఆర్టీసీ బస్టాండులో అతనిపై ప్రత్యర్థులు హత్యాయత్నం చేసిన ఘటన మార్కాపురంలో జరిగింది. - 8లో..

గరిష్టం/కనిష్టం
32 /25

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

సింగరాయకొండ జూనియర్ సివిల్ జడ్జిగా లీలా శ్యామ్ సుందరి

ఒంగోలు: సింగరాయకొండ జూనియర్ సివిల్ జడ్జిగా వి.లీలా శ్యామ్ సుందరిని నియమిస్తూ ఏపీ హైకోర్టు రిజిస్ట్రార్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ఇప్పటి వరకు ఈమె తూర్పు గోదావరి జిల్లా కాకినాడ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవలే నూతనంగా ఏర్పాటు చేసిన సింగరాయకొండ జూనియర్ సివిల్ జడ్జిగా ఒంగోలు మొబైల్ కోర్టు జడ్జి వి.వెంకటేశ్వరరావు మంగళ, శుక్రవారాలలో అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. తాజా నియామకంతో సింగరాయకొండ జూనియర్ సివిల్ కోర్టులో కేసుల పరిశీలన వేగవంతం కానుంది.

ఇసుక దోపిడీని అరికట్టకుంటే సమ్మె



వినతి పత్రం అందజేస్తున్న లారీ యజమానులు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలో ఇసుక దోపిడీని అరికట్టకపోతే ఈ నెల 16 నుంచి లారీల సమ్మె చేస్తామని, అవసరమైతే తామే వినియోగదారులకు టన్ను ఇసుక రూ.950 లకు అందజేస్తామని మార్కాపురం లారీ అసోసియేషన్ నాయకులు సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. కాంట్రాక్టర్ గొట్టిపాటి సురేంద్ర గతంలో తాము తెచ్చే ఇసుకను టన్ను రూ.950లకు కొనుగోలు చేసి వినియోగదారులకు టన్ను రూ.1200 లకు అమ్ముకునే వారని అన్నారు. అయితే ఈ నెల 1న తమను పిలిపించి కేవలం టన్ను ఇసుక రూ.800లకు మాత్రమే విక్రయించాలని సురేంద్ర కోరారని లారీ అసోసియేషన్ నాయకులు తెలిపారు. దీన్ని మేము వ్యతిరేకిస్తున్నామని, ఇప్పటికే ఈ విషయమై కలెక్టర్, ఎస్పీ, స్థానిక అధికారులకు వినతి పత్రాలు అందజేశామన్నారు. వారు స్పందించకపోతే ఈ నెల 16 నుంచి యార్డుకు ఇసుక సరఫరా నిలిపేస్తామని హెచ్చరించారు. అవసరమైతే మేమే వినియోగదారులకు ఇసుక టన్ను రూ.950లకు విక్రయిస్తామన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఉచిత ఇసుక అని గొప్ప చెబుతున్నారని ఆచరణలో మాత్రం ప్రజల నుంచి ఎక్కువ వసూలు చేస్తున్నారని వినతిపత్రంలో తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కాశీరాంసింగ్, లారీ అసోసియేషన్ నాయకులు ఉన్నారు.

ఏకేయూ బీఎడ్ మూడో సెమిస్టర్ ఫలితాలు విడుదల

- రిజిస్ట్రార్ ప్రొఫెసర్ హరిబాబు



బీఎడ్ మూడో సెమిస్టర్ ఫలితాలు విడుదల చేస్తున్న రిజిస్ట్రార్ హరిబాబు

ఒంగోలు సిటీ: ఆంధ్ర కేసరి యూనివర్సిటీ పరిధిలోని బీఎడ్ కళాశాలల్లో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి మూడో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను ఏకేయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డీవీఆర్ మూర్తి సూచనల మేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.హరిబాబు సోమవారం సాయంత్రం విడుదల చేశారు. ఈ పరీక్షలకు మొత్తం 10,955 మంది విద్యార్థులు హాజరు కాగా, వారిలో 94.37 శాతంతో 10,339 మంది ఉత్తీర్ణులయ్యారు. ఆంధ్రకేసరి యూనివర్సిటీ స్థాయిలో, ఆయా కళాశాలల స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఏకేయూ ఉప కులపతి ప్రొఫెసర్ డీవీఆర్ మూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.హరిబాబు అభినందించారు. మూడో సెమిస్టర్ ఫలితాల విడుదల కార్యక్రమంలో సీఈ ప్రొఫెసర్ సోమశేఖర, పీజీ కో ఆర్డినేటర్ (నాన్ కాన్ఫిడెన్షియల్) డాక్టర్ ఆర్.శ్రీనివాస్, పరీక్షల విభాగం పర్యవేక్షకులు సూడా శివరామ్‌తో పాటు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పీఏసీఎస్‌లకు త్రిసభ్య కమిటీల నియామకం

ఒంగోలు సబర్బన్: జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు (పీఏసీఎస్)కు త్రిసభ్య కమిటీలను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ఎక్స్ అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. వ్యవసాయ అండ్ సహకార విభాగానికి చెందిన ఉన్నతాధికారులకు జీఓ ఆర్‌టీ నంబర్–669 ఉత్తర్వులను అందజేశారు. అందుకుగాను జిల్లాలోని 46 పీఏసీఎస్‌లకు నాన్ అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జెస్ కమిటీలను నియమించారు. ఒక్కో సొసైటీకి చైర్‌పర్సన్‌తో పాటు ఇద్దరు సభ్యులను నియమిస్తూ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వీరి పదవీ కాలం 2026 జనవరి 30వ తేదీ వరకు కొనసాగుతుంది. అప్పటి వరకుకానీ లేక ఆయా సొసైటీలకు ఎన్నికలు జరిగే వరకు కానీ త్రిసభ్య కమిటీ పదవిలో కొనసాగుతారని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సాగు కలిసిరాక.. ఎరువు దిగిరాక!

కరువు కోరల్లో చిక్కుకుని అల్లాడుతున్న జిల్లా రైతాంగంపై ఎరువుల ధరల పిడుగు పడింది. గిట్టుబాటు ధర లభించక సాగుభారంగా మారిన పరిస్థితుల్లో పెరిగిన ఎరువుల ధరలు గుదిబండగా మారనున్నాయి. ప్రతికూల వాతావరణం నేపథ్యంలో పంట దిగుబడి సైతం భారీగా పడిపోయింది. ఖరీఫ్‌లోనైనా గట్టెక్కుదామని ఆశపడిన రైతుల్లో ఎరువుల ధరలు పెరగడం ఆందోళన కలిగిస్తోంది. కంపెనీని బట్టి బస్తాకు రూ.100 నుంచి రూ.250 వరకూ ధర పెరిగింది. ఇలా అయితే సాగుకష్టమంటూ రైతులు వాపోతున్నారు.



ఎరువుల బస్తాలు

- సీజన్ ప్రారంభంలోనే భారీగా పెరిగిన ఎరువుల ధరలు
- బస్తాకు రూ.100 నుంచి రూ.250 వరకు పెరుగుదల
- రైతులపై అదనపు భారం
- ఖరీఫ్‌లో సాగు విస్తీర్ణం 1,29,102 హెక్టార్లు
- జిల్లాలో భారీగా పడిపోయిన సాగు విస్తీర్ణం
- ఖరీఫ్‌కు అవసరమైన ఎరువులు 54,468 మెట్రిక్ టన్నులు
- ఇప్పటి వరకూ పంపిణీ 26,759 మెట్రిక్ టన్నులు

మార్కాపురం: ఖరీఫ్ ప్రారంభంలోనే కూటమి ప్రభుత్వం రైతులకు షాక్ ఇస్తోంది. ఎరువుల ధరలు భారీగా పెరగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో శనగ, మిర్చి, పత్తి, పొగాకు సాగు చేసిన రైతులకు ఆశించిన స్థాయిలో గిట్టుబాటు ధరలు లభించడంలేదు. ప్రభుత్వం సైతం పట్టించుకోకపోవడంతో అన్నదాతలు కుదేలయ్యారు. గత సీజన్లలో జరిగిన నష్టాన్ని ఖరీఫ్ సీజన్‌లోనైనా పూడ్చుకుందామని రైతులు ఆశపడ్డారు. పంటల సాగుకు సిద్ధమవుతున్న తరుణంలో కేంద్రం ఎరువుల ధరలు పెంచడంతో వ్యవసాయం చేయడం కష్టమని వాపోతున్నారు. ఇప్పటికే అప్పులు ఎక్కువై పలువురు రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. మరో వైపు బ్యాంక్‌ల నుంచి ఖరీఫ్ సీజన్‌లోనైనా వ్యవసాయ రుణాలు వస్తాయా, రావా అనే సందిగ్ధంలో రైతులు ఉండగా, ఊహించని విధంగా ఎరువుల



ధరలు పెరగటంతో పంటల సాగు చేయాలంటే రైతులు భయపడుతున్నారు.

జిల్లాలో పంటల సాగు ఇలా

జిల్లా వ్యాప్తంగా 1,29,102 హెక్టార్లలో పంటలు సాగు కావాల్సి ఉండగా ఈ నెల 3వ తేదీ నాటికి 17,285 హెక్టార్లలో మాత్రమే సాగయ్యాయి. అంటే కేవలం 13.39 శాతం మాత్రమే పంటలు సాగు చేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై 2 నెలలు దాటినా వర్షాలు లేకపోవడంతో పంటల సాగు ముందుకెళ్లడం లేదు. వరి, మొక్కజొన్న, జొన్న, పత్తి, ఇతర పంటలతో పాటు పాడిపోషణలో భాగంగా పారా గడ్డి పెరు గుదలకు యూరియా బాగా అవసరం అవుతోంది. సహకార సొసైటీలు, రైతు సేవా కేంద్రాల ద్వారా ఎరువుల సరఫరా నత్తనడకన సాగుతోందన్న ఆరోపణలు ఉన్నాయి.

ప్రధానంగా ప్రతి రైతు దుక్కిలో హెక్టారుకు రెండున్నర బస్తాల డీఏపీని కచ్చితంగా వేస్తారు. 28–28 రకంలో యూరియా, భాస్వరం ఉంటాయి. వేర్లు ఏపుగా పెరిగేందుకు ఉపయోగపడతాయి. 14–35–14 (నత్రజని, భాస్వరం, పొటాష్) ఎరువు వరి, మిర్చిలో ఎక్కువగా వినియోగిస్తారు. 20–20–20–0–13 ఈ ఎరువును వరి, మిర్చి పంటలకు ఎక్కువగా వాడుతారు. ఈ ఎరువులను రైతులు ప్రతి పంటకు వేస్తుంటారు. ఇందులో ప్రధానంగా నత్రజని పెరుగుదలకు, భాస్వరం వేర్ల అభివృద్ధికి, పొటాష్ గింజ నాణ్యతకు, బరువు పెరుగుదలకు, పురుగులు, తెగుళ్ల తట్టుకునే వ్యాధి నిరోధక శక్తి పెరిగేందుకు ఉపయోగపడుతుంది. దీంతో కాంప్లెక్స్ ఎరువులను రైతులు కచ్చితంగా వినియోగించాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో పెరిగిన ఎరువులు ధరలు రైతులకు భారంగా మారనున్నాయి.

జిల్లాలో ఎరువుల నిల్వలు ఇలా

జిల్లాలో ఖరీఫ్ సీజన్ మొత్తం మీద 54,468 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమవుతాయని అధికారులు అంచనా వేశారు. గత ఏడాది ఖరీఫ్, రబీకి సంబంధించి ఏప్రిల్ 1 నాటికి 27,111 మెట్రిక్ టన్నుల ఎరువులు మిగులు ఉన్నాయి. ఈ ఏడాది ఆగస్టు 7 నాటికి 29,274 మెట్రిక్ టన్నుల ఎరువులు జిల్లాకు చేరాయి. దీంతో మొత్తం 56,385 మెట్రిక్ టన్నుల ఎరువులు నిల్వ ఉండగా ఇప్పటి వరకు 26,759 మెట్రిక్ టన్నుల ఎరువులను విక్రయించారు. ప్రస్తుతం 29,626 మెట్రిక్ టన్నుల ఎరువులు నిల్వ ఉన్నాయి. ఇందులో కాంప్లెక్స్ ఎరువులు, డీఏపీ, యూరియా, ఎన్పీకే, ఎస్ఎస్‌పీ, ఎంఓపీ, తదితర రకాల ఎరువులు దుకాణాల్లో ఉన్నాయి. కాంప్లెక్సు ఎరువులకు సంబంధించి 158.45 మెట్రిక్ టన్నులు, డీఏపీ 2933.999 మెట్రిక్ టన్నులు, ఎన్పీకేఎస్ 15,922.44 మెట్రిక్ టన్నులు, యూరియా 6,593.492 మెట్రిక్ టన్నుల ఎరువులు నిల్వ ఉన్నాయి. ఇంకా ఎంఓపీ, ఎఫ్ఓఎం, ఎస్ఎస్‌పీ తదితర రకాలు కూడా రైతు సేవా కేంద్రాలు, ప్రైవేటు డీలర్ల వద్ద ఉన్నాయి. ఇదిలా ఉండగా ప్రైవేటు వ్యాపారస్తులు మాత్రం రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారు.

ఎరువుల ధరలు తగ్గించాలి



ఇప్పటికే దిగుబడులు రాక ఇబ్బందులు పడుతున్నాం. ఇటువంటి పరిస్థితుల్లో కేంద్రం ఎరువుల ధరలు పెంచడంతో వ్యవసాయం చేయాలంటే భారంగా ఉంది. ప్రధానంగా వరి, పత్తి, మిర్చి సాగుకు అవసరమయ్యే ఎరువుల ధరలను కేంద్ర ప్రభుత్వం పెంచింది. ఈ ఏడాది ఇప్పటి వరకూ వర్షాలు లేక ఇబ్బంది పడుతున్నాం. పత్తి సాగు చేసినప్పటికీ వర్షాలు లేకపోవడంతో వాడుముఖం పడుతోంది. ఇటువంటి పరిస్థితుల్లో ధరలు పెంచడం రైతులకు భారమే.

– టీ రామిరెడ్డి, రైతు, కొట్టాలపల్లి, మార్కాపురం మండలం

ఎరువుల కొరత లేదు



జిల్లాలో ఇప్పటి వరకు ఎరువుల కొరత లేదు. రైతులకు అవసరమైన ఎరువులను పీఏసీఎస్, రైతు సేవా కేంద్రాలు, ప్రైవేటు డీలర్ల వద్ద ఉన్నాయి. అవసరమైతే ఇంకా తెప్పిస్తాం. యూరియా 2,811 మెట్రిక్ టన్నులు అవసరమని గుర్తించి 5625 మెట్రిక్ టన్నులకు ప్లాన్ చేశాం. డీఏపీ 1639, ఎన్పీకేఎస్ 5591 టన్నులు అవసరమని గుర్తించి అందుకు తగిన ఏర్పాట్లు చేశాం. జిల్లాలో ఇప్పటికే వివిధ రకాల ఎరువులకు సంబంధించి 29,626 మెట్రిక్ టన్నుల నిల్వలు అందుబాటులో ఉన్నాయి.

– శ్రీనివాసరావు, జేడీఏ, ఒంగోలు

ఎరువు	పాత ధర	పెరిగిన ధర
గ్రోమోర్ (14.35.14)	1700	1800
పొటాష్	1535	1800
24.24.0	1700	1800
10.26.26	1470	1800
16.16.16	1450	1600
20.20.013	1300	1425
16.20.013	1250	1300
సింగిల్ సూపర్ ఫాస్ఫేట్	580	640

రాష్ట్రాన్ని దోచేస్తున్న చంద్రబాబు

- రక్షక భటులను భక్షక భటులుగా మార్చారు
- పోలీసులకు వసూళ్ల డ్యూటీలు వేసి దండుకుంటున్నారు
- స్థాయిలేని పచ్చనేత నెలకు రూ.2 కోట్లు వసూలు చేస్తున్నాడు
- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్



సభలో పాల్గొన్న ప్రజలు

త్రిపురాంతకం (యర్రగొండపాలెం): మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు రాష్ట్రాన్ని దోచుకునే పనిలో పడ్డారని ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ విమర్శించారు. త్రిపురాంతకంలోని ఆర్యవైశ్య అన్నదాన సత్రంలో సోమవారం నిర్వహించిన బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు మండల పార్టీ కన్వీనర్ సింగారెడ్డి పోలిరెడ్డి అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న పేద ప్రజల ఆర్తనాదాలు కూటమి ప్రభుత్వానికి వినిపించడంలేదని, ఎన్నికల ముందు చేసిన వాగ్దానాలు కూటమి ప్రభుత్వం విస్మరించిందని అన్నారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామని చెప్పిన పచ్చ పెద్దమనుషులు అధికారంలోకి వచ్చిన తరువాత ఒక్క పథకాన్ని కూడా సక్రమంగా అమలు చేయలేదన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న కాలంలో అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఖరీఫ్ సీజన్‌లో 1.76 కోట్ల టన్నుల ఎరువులను ఆర్బీకేలలో నిలువ ఉంచి పంపిణీ చేశారని, చంద్రబాబు ఇప్పటి వరకు ఎరువులను అందజేయలేదని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇసుక, బియ్యం, మట్టి స్కాంలలో తమ నాయకులను కేటాయించి దోచుకోండని ప్రోత్సహిస్తున్నారని, ప్రజలను రక్షించే పోలీసులను భక్షక భటులుగా మార్చి తమకు అనుకూలంగా మలుచుకున్నారని ఆయన విమర్శించారు. పోలీస్ స్టేషన్లను వసూళ్ల స్టేషన్లుగా మార్చి కోట్లాది రూపాయలు దండుకుంటున్నారని, కొంతమంది పోలీసులు కూటమి నాయకులకు వత్తాసు పలకటమే పనిగా పెట్టుకున్నారని ఆయన అన్నారు. తనకు అన్యాయం జరిగిందని ఎవరైనా పోలీస్ స్టేషన్‌కు వెళ్తే తమ వర్గీయులే చేసిఉంటారని చెప్తున్నారని, పుల్లలచెరువు మండలంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వర్గానికి చెందిన రైతు ట్రాక్టర్‌ను తగుల బెడితే తమ పార్టీకి చెందిన నాయకుడే తగులబెట్టి ఉంటాడంటున్నారని అన్నారు. నియోజకవర్గంలో స్థాయిలేని టీడీపీ నాయకుడు ఒకరు ప్రభుత్వ కార్యాలయాల నుంచి నెలకు రూ.2 కోట్లు వసూలు చేస్తున్నాడని, ఆ నాయకుడు డబ్బులు దండుకుంటూ ఆపై దబాయింపులకు దిగుతున్నాడని ఆయన ఆరోపించారు. అంగన్‌వాడీ పోస్టులను అమ్ముకుంటున్నాడని, కేజీబీవీ పాఠశాలలో అడ్మిషన్లు సైతం తమ గుప్పెట్లో పెట్టుకొని ఆ ఖాళీలను భర్తీ చేయిస్తున్నారని అన్నారు. కోట్లాది రూపాయలు విలువ చేసే పెద్దదోర్నాలలోని ఆర్టీసీ బస్టాండ్ స్థలంపై టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు కన్నేశాడని అన్నారు. ఆయన నియోజకవర్గంలో డబ్బులు దండుకోవటానికి అధికారం చెలాయిస్తుంటాడని, ప్రజలకు మాత్రం అందుబాటులో ఉండడని ఆయన వ్యంగ్యంగా అన్నారు. యర్రగొండపాలెంలో సాగర్ పైపులను తవ్వుకొని ఎత్తుకొని వెళ్తుంటే చూస్తూ ఉరుకుంటున్నాడని, ఆయన ప్రజలకు ఎటువంటి మేలు చేస్తాడని ఎమ్మెల్యే ప్రశ్నించారు. త్రిపురాంతకం, ముటుకుల రక్షిత మంచి నీటి పథకాల నిర్వహణ కాంట్రాక్టర్ల నుంచి రూ.40 లక్షలు వసూలు చేసుకున్నాడని, అటువంటి నాయకుడు నియోజకవర్గంలోని నీటి సమస్యను ఏ విధంగా పరిష్కరిస్తాడని దుయ్యబట్టారు. పోలీసుల సహకారంతో ఇసుక లారీలను అడ్డుకొని టన్నుకు రూ.300, ఎన్ఆర్ఈజీఎస్‌లో పనికి వెళ్లే ఒక్కొక్క ఉపాధి కూలి నుంచి రూ.300, పనికి వెళ్లకుండా మస్టర్ వేయించుకునేవారి నుంచి రూ.600 ప్రకారం వసూళ్లు చేసుకుంటున్నాడని ఆయన తీవ్రంగా విమర్శించారు. నీ చర్యలు నియోజకవర్గ ప్రజలు గమనిస్తున్నారని, త్వరలో నిన్ను తరిమి వేసే రోజులు దగ్గర పడ్డాయని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆళ్ల సుబ్బమ్మ, జెడ్పీటీసీ మాకం జాన్‌పాల్, మాజీ ఎంపీపీ ఆళ్ల ఆంజనేయరెడ్డి, వైస్ ఎంపీపీ పాటిబండ్ల కృష్ణ, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు శాసం రంగబాబు, బీసీ సంఘం జిల్లా కార్యదర్శి రాచగొర్ల పిచ్చయ్య, ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు దొందేటి నాగేశ్వరరెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు ఏకుల మునలారెడ్డి, గంటా వెంకటరమణారెడ్డి, పి.కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

లొంగుబాటులో ముప్పా సురేష్ ?

- ముందస్తు బెయిల్‌ను తిరస్కరించిన సుప్రీం కోర్టు

ఒంగోలు టౌన్: టీడీపీ నాయకుడు, నాగులుప్పలపాడు మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్య చౌదరి హత్య కేసులో పోలీసులకు చిక్కకుండా తిరుగుతున్న ప్రధాన నిందితుడు ముప్పా సురేష్ ముందున్న దారులన్నీ మూసుకొనిపోవడంతో నేడో రేపో పోలీసుల ఎదుట లొంగిపోయేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు సమాచారం. వీరయ్య చౌదరి హత్య కేసులో ఇప్పటికే 9 మంది నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వారిలో ఐదుగురికి బెయిల్ కూడా మంజూరైంది. అయితే ఈ హత్య కేసులో మొదటి నుంచి పోలీసులకు చిక్కకుండా తప్పించుకొని తిరుగుతున్న ముప్పా సురేష్ అరెస్టు నుంచి తప్పించుకునేందుకు అనేక ప్రయత్నాలు చేస్తున్నాడు. తొలుత ఈ హత్యతో తనకెలాంటి సంబంధంలేదని బుకాయించిన ఆయన పోలీసులు ఆధారాలను సమర్పించడంతో ముందస్తు బెయిల్ కోసం ప్రయత్నాలు ప్రారంభించారు. హైకోర్టుకు వెళ్లిన ఆయనకు బెయిల్ ఇచ్చేందుకు న్యాయమూర్తి తిరస్కరించారు. దాంతో బెయిల్ కోసం సుప్రీం కోర్టును ఆశ్రయించారు. సోమవారం విచారణ జరిపిన న్యాయమూర్తులు ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించారు. బెయిల్ కోసం ఆయన వేసిన పిటిషన్‌ను డిస్మిస్ చేసినట్లు తెలుస్తోంది. కింది కోర్టులోనే తేల్చుకోవాలని సురేష్ తరఫున వాదిస్తున్న న్యాయవాదికి సూచించినట్లు సమాచారం. ముందస్తు బెయిల్ మీద పెట్టుకున్న ఆశలు నీరుగారడంతో మళ్లీ హైకోర్టు తలుపులు తట్టడం కంటే పోలీసుల ఎదుట లొంగిపోవడమే మేలని కొందరు సన్నిహితులు ఆయనకు సలహా ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. మంగళ, బుధవారాల్లో ముప్పా సురేష్ పోలీసులకు లొంగిపోనున్నట్లు తెలుస్తోంది.

వాహన మిత్ర నగదు ఇచ్చి ఆదుకోవాలి

- కందులూరు–1 డ్వాక్రా గ్రూపులో ఫోర్జరీ సంతకాలు చేసిన వెలుగు సీసీ
- చింతలలో అక్రమంగా సాగు చేసిన రొయ్యల చెరువులు తొలగించాలి
- మీ కోసంలో కలెక్టర్‌కు అర్జీలు



కందులూరు డ్వాక్రా గ్రూపులో అక్రమాలను జేసీకి వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు బొట్ల సుబ్బారావు, గ్రూపు సభ్యులు

ఒంగోలు సబర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న ప్రతి ఆటో కార్మికుడికి వాహన మిత్ర పథకం కింద సంవత్సరానికి రూ.25 వేలు ఇచ్చి ఆదుకోవాలని ఆటో కార్మికులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నాయకులు గంటినపల్లి శ్రీనివాసులు, తంబి శ్రీనివాసులు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న మీ కోసం కార్యక్రమంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటో కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తే ఆటో డ్రైవర్లకు బాడుగులు తగ్గుతాయని, ఆటో కార్మికుల ఉపాధి దెబ్బతింటుందన్నారు. ఇప్పటికే పెరిగిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలతో ఇబ్బందులు పడుతున్నామని విన్నవించారు. పెట్రోల్, డీజిల్ చార్జీలపై విధించిన వ్యాట్ తగ్గించాలని డిమాండ్ చేశారు. అన్ని రకాల ఫీజులు, పెనాల్టీలు తగ్గించాలని, ఇన్సూరెన్స్ ప్రీమియం తగ్గించాలని, వాహన కొనుగోలుకి బ్యాంకుల ద్వారా రూ.4 లక్షలు సబ్సిడీతో వడ్డీ లేని రుణాలు మంజూరు చేయాలని కోరారు.


ఫోర్జరీ సంతకాలతో డ్వాక్రా గ్రూపులో మార్పులు...

టంగుటూరు మండలం కందులూరు గ్రామంలోని కందులూరు–1 లోని గ్రామైక్య సంఘంలో సభ్యులుగా ఉన్న డ్వాక్రా గ్రూప్ సభ్యులకు తెలియకుండా, గ్రూపుల సమావేశం జరపకుండా ఫోర్జరీ, దొంగ సంతకాలతో దారుణాలు చేశారని గ్రామైక్య సంఘం సభ్యులు మీ కోసం కార్యక్రమంలో కలిసి అందుకు సంబంధించిన ఆధారాలను అధికారులకు సమర్పించారు. వెలుగు సీసీ చెన్నుపాటి కవిత నిర్వహణ బాధ్యుల పేర్లను మార్చి అక్రమాలకు పాల్పడిందన్నారు. కవితపై సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. మీ కోసం కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం నాయకులు బొట్ల సుబ్బారావుతో పాటు డ్వాక్రా గ్రూపు సభ్యులు ఉన్నారు.

అక్రమంగా వేసిన రొయ్యల చెరువులు తొలగించాలి:

కొత్తపట్నం మండలం అల్లూరు పంచాయతీ పరిధిలోని చింతల వద్ద (టిడ్కో ఇళ్లకు ఆనుకొని) అక్రమంగా వేసిన రొయ్యల చెరువులను తొలగించాలని చింతలకు చెందిన డీఎల్ఎస్‌వీ పీఎల్‌వీ శింగంనేని ఆంజనేయులు మీ కోసం కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. చింతలకు చెందిన మంచినీటి చెరువుకు ఆనుకొని వాన్‌పిక్‌కు చెందిన భూముల్లో గ్రామానికి చెందిన శింగంనేని చంద్రశేఖర్ రావు అక్రమంగా రొయ్యల చెరువులు సాగు చేస్తున్నాడన్నారు. ఎలాంటి అనుమతులు లేకపోయినా విద్యుత్ అధికారులు అక్రమంగా విద్యుత్ కనెక్షన్లు కూడా ఇచ్చారని చెప్పారు. అధికార పార్టీ అండదండలతో అక్రమంగా రొయ్యల చెరువులు సాగు చేస్తున్నా అధికారులు మాత్రం చర్యలు తీసుకోవటం లేదని ఫిర్యాదు చేశారు.

ఉధృతంగా గుండ్లకమ్మ



నెమలిగుండ్ల రంగనాయకస్వామి దేవస్థానం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గుండ్లకమ్మ

రాచర్ల: మండలంలోని జేపీ చెరువు గ్రామ సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన నెమలిగుండ్ల రంగనాయకస్వామి దేవస్థానం సమీపంలోని నీటిగుండం వద్ద గుండ్లకమ్మవాగు ఉధృతంగా పరుగులు పెడుతోంది. ఆదివారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షం కారణంగా లక్ష్మమ్మవనం సమీపంలోని సిమెంటు రోడ్డుపై నుంచి గుండ్లకమ్మ వాగు సోమవారం ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎత్తయిన కొండల నుంచి వేగంగా నీటి గుండంలోకి జారుతున్న జలపాతం పర్యాటకులను ఆకట్టుకుంటోంది. దేవస్థానం సమీపంలోని నీటిగుండం వద్దకు పర్యాటకులకు అనుమతించకుండా సిబ్బంది చర్యలు చేపట్టారు.

ఉద్యోగాల పేరుతో రూ.5.90 లక్షలకు టోకరా


బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు టౌన్: పంచాయతీరాజ్ శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ ఒంగోలు ఇందిరాకాలనీకి చెందిన వ్యక్తి తనతో పాటు మరో 15 మంది వద్ద నుంచి 5.90 లక్షల రూపాయలు వసూలు చేసి మోసం చేశాడని ఒంగోలు సమతా నగర్‌కు చెందిన బాధితుడు సోమవారం పోలీస్‌శాఖ నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌లో ఎస్పీ ఏఆర్ దామోదర్‌కు ఫిర్యాదు చేశారు. తమకు ఉద్యోగ నియామక పత్రాలు కూడా ఇచ్చాడని, వాటిని తీసుకుని కార్యాలయాలకు వెళ్లి అధికారులకు సంప్రదించగా, అవి నకిలీ నియామకపత్రాలని తెలిసిందని వాపోయాడు. దాంతో సదరు వ్యక్తిని ప్రశ్నించగా నిర్లక్ష్యంగా జవాబు ఇస్తున్నాడని తెలిపారు. అలాగే మోటారు బైకు పేరుతో మోసపోయినట్లు మరొకరు ఫిర్యాదు చేశారు. మోటారు బైకు కొనుగోలు చేసేందుకుగానూ ఒంగోలుకు చెందిన ఒక డీలర్‌ను సంప్రదించగా తన వద్ద 90 వేల రూపాయలకు రాయల్ ఎన్‌ఫీల్డ్ వాహనం ఉందని నమ్మబలికాడన్నారు. అందుకుగానూ తొలుత రూ.20 వేల అడ్వాన్స్ తీసుకున్నాడని తెలిపారు. రెండు రోజుల్లో వాహనాన్ని డెలివరీ చేస్తానని చెప్పాడని, నేటికి 15 రోజులు గడిచినప్పటికీ వాహనం ఇవ్వలేదని తెలిపారు. తన వద్ద తీసుకున్న డబ్బులు తిరిగి చెల్లించమని అడిగితే బెదిరిస్తున్నాడని చెప్పారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన మీ కోసం కార్యక్రమానికి 52 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన బాధితులతో నేరుగా ఎస్పీ మాట్లాడి వారి సమస్యలడిగి తెలుసుకున్నారు. వెంటనే ఆయా పోలీసు స్టేషన్ల అధికారులతో ఫోన్లో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ సెల్ ఇన్‌స్పెక్టర్ దుర్గా ప్రసాద్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ జగదీష్, ట్రాఫిక్ సీఐ పాండురంగారావు, గ్రీవెన్స్ ఎస్సై జనార్దన్‌రావు పాల్గొన్నారు.

బైకు ఢీకొని మున్సిపల్ వర్కర్ మృతి


మృతిచెందిన పిన్నిక విజయమ్మ (ఫైల్)

చీమకుర్తి: బైకు ఢీకొనడంతో చీమకుర్తి మున్సిపాలిటీలో వర్కర్‌గా పనిచేస్తున్న పిన్నిక విజయమ్మ (50) మృతి చెందింది. సోమవారం తెల్లవారుజామున చీమకుర్తి మెయిన్ రోడ్డులోని జవహర్ ఆస్పత్రి సమీపంలో తోటి మున్సిపల్ వర్కర్లతో కలిసి చెత్త ఎత్తి ట్రాక్టర్‌లో వేస్తున్న సమయంలో బైకుపై వెళ్తున్న ముత్తువేల్ అనే వ్యక్తి విజయమ్మను ఢీకొట్టాడు. ఆమె పక్కటెముకలు విరిగి తీవ్ర గాయాలతో రోడ్డుపై పడిపోయింది. తోటి వర్కర్లు స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్లగా, పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో ఒంగోలు జీజీహెచ్‌కి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతిచెందినట్లు మృతురాలు భర్త పిన్నిక శ్రీనివాసరావు తెలిపారు. బైకుతో ఢీకొట్టిన ముత్తువేల్ స్థానిక గ్రానైట్ క్వారీలో పొక్లెయిన్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతురాలి భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముత్తువేల్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ ఎం.సుబ్బారావు వెల్లడించారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి


మృతి చెందిన వ్యక్తి

కంభం: ఓ గుర్తుతెలియని వ్యక్తి అనుమానాస్పదస్థితిలో రైలు కిందపడి మృతిచెందిన సంఘటన సోమవారం కంభం మండలంలోని సూరేపల్లి సమీపంలో రైలు పట్టాలపై వెలుగు చూసింది. మార్కాపురం రైల్వే పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సుమారు 35–40 సంవత్సరాల వయసున్న వ్యక్తి రైలు కింద పడి మృతి చెందాడు. నైట్ ప్యాంట్, చెక్స్ షర్టు ధరించి ఉన్నాడు. అతని వద్ద ఆదివారం రాత్రి కంభం నుంచి గుంటూరు వెళ్లేందుకు ఇద్దరికి తీసుకున్న టికెట్ ఉంది. అతని చేతికి రాఖీ కట్టి ఉంది. మృతదేహం పడి ఉన్న తీరు చూస్తే రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తున్నప్పటికీ.. మృతుడి వద్ద ఇద్దరికి సంబంధించిన టికెట్ ఉన్న నేపథ్యంలో అతనితో పాటు ఉన్న మరో వ్యక్తి ఎవరు, టికెట్ తీసుకుని కంభం రైల్వేస్టేషన్ నుంచి 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న సూరేపల్లి వరకు ఎందుకు వెళ్లాడనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒక వేళ రైల్లోనే ప్రయాణించి దిగాడనుకుంటే.. అక్కడ రైల్వేస్టేషన్ కూడా లేదు. అలాంటప్పుడు ఆ వ్యక్తి అక్కడికి ఎందుకు వెళ్లాడు, ఎలా వెళ్లాడు.? అతనితో పాటు ఉన్న మరో వ్యక్తి ఎవరో తేలాల్సి ఉంది. మృతదేహం నంద్యాల వైపు వెళ్లే పట్టాలపై పడి ఉండగా, రైలు పట్టాలకు ఇరువైపులా చెప్పులు పడి ఉన్నాయి. దీంతో అతని మృతిపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పూర్తి వివరాలు పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

తియ్యటి రోజులు తిరిగొచ్చేనా..!


చెరకు పంట (ఫైల్)

- కంభం చెరువు ఆయకట్టు కింద పూర్తిగా కనుమరుగైన చెరకు పంట
- గతంలో 1000 ఎకరాలకుపైగా చెరకు సాగు
- కంభంలో కొన్ని సంవత్సరాల పాటు కొనసాగిన షుగర్ ఫ్యాక్టరీ
- ఏడాదిలో ఆరు నెలల పాటు బెల్లం తయారీ
- ప్రస్తుతం 20–30 ఎకరాల్లోనే చెరకు సాగు
- అడవి పందుల బెడదే ప్రధాన కారణం
- చెరకు సాగును పూర్తిగా వదిలేసి అరటివైపు మొగ్గుచూపిన ఆయకట్టు రైతులు
- ప్రభుత్వం పట్టించుకుని ప్రోత్సహించాలంటున్న ప్రజలు

కంభం: ఎటుచూసినా చెరకు తోటలు.. పంట కోతకొస్తే ఏడాదిలో సుమారు 6 నెలల పాటు బెల్లం తయారీ.. షుగర్ ఫ్యాక్టరీతో పాటు ఆ చుట్టుపక్కల ఎక్కడ చూసినా చెరకు రసం తియ్యదనం.. ఇవన్నీ కంభం, ఆ పరిసర ప్రాంతాల్లో ఒకప్పటి రోజులు. ప్రస్తుతం ప్రజలతో పాటు రైతులకు కూడా ఆ తియ్యదనం దూరమైంది. కేవలం అడవి పందుల బెడద కారణంగా కంభం చెరువు ఆయకట్టులో చెరకు సాగును రైతులు పూర్తిగా వదిలేశారు. అరటి సాగువైపు మొగ్గుచూపారు. చారిత్రాత్మక కంభం చెరువు ఆయకట్టు ఒకప్పుడు చెరకు పంటతో కళకళలాడుతుండేది. చెరకు పంట సాగుకు కంభం, ఆ పరిసర ప్రాంతాలు పెట్టింది పేరుగా ఉండేవి. కంభంలో తయారు చేసిన బెల్లం రాష్ట్రంలోని పలు ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాలకు సైతం ఎగుమతయ్యేది. కంభం చెరువు ఆయకట్టు పరిధిలో సుమారు వెయ్యి ఎకరాల్లో చెరకు పంట సాగు చేసేవారు. దసరా, సంక్రాంతి, ఇతర ముఖ్య పండుగలకు బెల్లంకు డిమాండ్ ఎక్కువగా ఉంటుండటంతో వ్యాపారులు ఏకంగా రైతుల పొలాల దగ్గరికే వచ్చి బెల్లం కొనుగోలు చేసేవారు. తురిమెళ్ల వెళ్లే రహదారి వెంట, బేస్తవారిపేట రహదారి పక్కన, కంభం చెరువుకు వెళ్లేమార్గంలో రైతులు బెల్లం తయారు చేస్తుంటే.. వాహనదారులు, ప్రయాణికులు అక్కడికి వెళ్లి రైతులను అడిగి చెరకు రసం తాగేవారు. చెరకు పంటకు తెగుళ్లు ఎక్కువగా ఆశించవు. అందువలన లాభాలు రాకపోయినా నష్టాలు మాత్రం వచ్చేవి కావు. దీంతో ఈ ప్రాంతంలో చెరకు సాగు అధికంగా ఉండేది. అప్పట్లో కంభం పట్టణంలో షుగర్ ఫ్యాక్టరీ కూడా ఉండేదంటే ఈ ప్రాంతంలో చెరకు పంట ఏ స్థాయిలో సాగయ్యేదో అర్థం చేసుకోవచ్చు.

20 ఏళ్లుగా నిలిచిపోయిన చెరకు సాగు...

దాదాపు 20 ఏళ్లుగా ఈ ప్రాంతంలో చెరకు పంట సాగు ఆగిపోయింది. చెరకు పంట సాగు కనుమరుగవడానికి ప్రధాన కారణం అడవి పందులే. ఆరుగాలం శ్రమించి సాగుచేసుకున్న చెరకు పంటపై అడవి పందుల దాడి పెరిగిపోయింది. చుట్టూ కొండలు ఉండటంతో పగలూరాత్రీ తేడా లేకుండా అడవి పందులు గుంపులు గుంపులుగా వచ్చి చెరకు తోటల్లో స్థావరాలు ఏర్పాటు చేసుకుని పంట మొత్తం నాశనం చేసేవి. వాటి నుంచి రక్షణ పొందేందుకు కరెంటు పెట్టినా ఫలితం లేకుండా పోయింది. అడవి పందులను చంపడం చట్టరీత్యా నేరమైనందుకు వాటిని ఏమీ చేయలేక కాలక్రమంలో రైతన్నలు చెరకు పంటనే తగ్గించుకుంటూ వచ్చారు. ప్రభుత్వాలు, అధికారులు సైతం అడవి పందుల నుంచి చెరకు పంటను రక్షించేందుకు చర్యలు తీసుకోకపోవడంతో ప్రస్తుతం చెరకు సాగు పూర్తిగా కనుమరుగైపోయింది.

ప్రత్యామ్నాయంగా అరటి సాగు...

చెరకు పంట సాగు చేయలేమని నిర్ణయించుకున్న కంభం చెరువు ఆయకట్టు రైతులు అరటి పంటను ప్రత్యామ్నాయ పంటగా ఎంచుకున్నారు. నంద్యాల, మహానంది, తమిళనాడు, తదితర ప్రాంతాల నుంచి అరటి పిలకలు తెప్పించి సాగుచేయడం మొదలు పెట్టారు. దీంతో ప్రస్తుతం కంభం చెరువు ఆయకట్టు కింద చెరకు స్థానంలో అరటి తోటలు దర్శనమిస్తున్నాయి. గతంలో పసుపు చివరి దశలో అంతర పంటగా చెరకు వేసే వారు. ప్రస్తుతం దాని స్థానంలో కూడా అరటి వేస్తున్నారు. అరటికి పెట్టుబడి ఎక్కువ. ఈదురుగాలులు, తుఫాన్‌లు వస్తే చెట్లు కూలి పోయి నష్టం వాటిల్లుతోంది. అయినప్పటికీ తప్పనిసరి పరిస్థితుల్లో రైతులు అరటినే సాగుచేసుకుంటున్నారు. ప్రస్తుతం కంభం పరిసర ప్రాంతాల్లో బోర్ల కింద అరటి సాగులో ఉంది.

కేవలం చెరకు రసం వరకే సాగు...

కంభం మండలంలో పూర్తిగా చెరకు సాగు కనుమరుగవగా, చుట్టుపక్కల ప్రాంతాల్లో 20–30 ఎకరాల్లో మాత్రమే చెరకు సాగు జరుగుతోంది. ఆ పంటను చెరకు రసం విక్రయించుకునే వారు కొనుగోలు చేసుకుంటున్నారు. బెల్లం తయారు చేయాలంటే ఎక్సైజ్ అధికారులు కొర్రీలు పెడుతుండటంతో రైతులు బెల్లం తయారీపై కూడా ఆసక్తి చూపడం లేదు. చెరకు రసం విక్రయదారులకు క్వింటాల చొప్పున చెరకు పంట విక్రయిస్తున్నారు.

చెరకు సాగుకు చర్యలు తీసుకోవాలి...

కంభం చెరువు ఆయకట్టు కింద రైతులు తిరిగి చెరకు పంట సాగుచేసుకునేలా ప్రభుత్వం, వ్యవసాయశాఖ అధికారులు చర్యలు తీసుకుని ప్రోత్సహించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. అడవి పందుల నుంచి రక్షణ కల్పించేందుకు భరోసా ఇవ్వడంతో పాటు ఉద్యానవన పంటల మాదిరిగా చెరకు పంట సాగుకు ప్రోత్సాహం అందిస్తే తిరిగి ఈ ప్రాంతంలో చెరకు సాగులోకి వచ్చే అవకాశం ఉందని ఇక్కడి ప్రజలు ఆశాభావం వ్యకం చేస్తున్నారు.

ప్రత్యామ్నాయంగా అరటి సాగు...

చెరకు పంట సాగు చేయలేమని నిర్ణయించుకున్న కంభం చెరువు ఆయకట్టు రైతులు అరటి పంటను ప్రత్యామ్నాయ పంటగా ఎంచుకున్నారు. నంద్యాల, మహానంది, తమిళనాడు, తదితర ప్రాంతాల నుంచి అరటి పిలకలు తెప్పించి సాగుచేయడం మొదలు పెట్టారు. దీంతో ప్రస్తుతం కంభం చెరువు ఆయకట్టు కింద చెరకు స్థానంలో అరటి తోటలు దర్శనమిస్తున్నాయి. గతంలో పసుపు చివరి దశలో అంతర పంటగా చెరకు వేసే వారు. ప్రస్తుతం దాని స్థానంలో కూడా అరటి వేస్తున్నారు. అరటికి పెట్టుబడి ఎక్కువ. ఈదురుగాలులు,


కంభం చెరువు ఆయకట్టు కింద చెరకు స్థానంలో సాగులో ఉన్న అరటి

తుఫాన్‌లు వస్తే చెట్లు కూలిపోయి నష్టం వాటిల్లుతోంది. అయినప్పటికీ తప్పనిసరి పరిస్థితుల్లో రైతులు అరటినే సాగుచేసుకుంటున్నారు. ప్రస్తుతం కంభం పరిసర ప్రాంతాల్లో బోర్ల కింద అరటి సాగులో ఉంది.

చెరకు సాగుకు బదులు అరటి వేస్తున్నాం



గతంలో పది ఎకరాలకుపైగా చెరకు తోటలు సాగుచేశాం. కూలీల ఖర్చులు పెరిగిపోవడం, అడవి పందుల దాడి ఎక్కువై పోవడంతో చెరకు సాగును పూర్తిగా వదిలేసి అరటి వేసుకుంటున్నాం.

– అబ్దుల్ వహీద్, రైతు, కంభం

పందుల బెడదతోనే



అడవి పందుల బెడదతోనే చెరకు పంటను రైతులు సాగుచేయడం లేదు. ఆరుగాలం శ్రమించి సాగుచేసుకున్న పంటను అడవి పందులు నాశనం చేస్తుండటంతో నష్టాలు రావడం మొదలై పూర్తిగా చెరకు వదిలేసే పరిస్థితులొచ్చాయి.

– షేక్ ఖయూం, రైతు, కంభం

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి యువకుడు బలి


నారాయణ (ఫైల్ ఫొటో)


దమ్ము చక్రాలపై ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్


విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను దమ్ము చక్రాల పైనుంచి తీసి దిమ్మెపై పెడుతున్న దృశ్యం

దర్శి: విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం ఓ యువకుడిని బలి తీసుకుంది. ఈ సంఘటన దర్శి పట్టణంలోని సందువారిపాలెం వద్ద సోమవారం చోటుచేసుకుంది. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు దిమ్మె ఏర్పాటు చేసి దానిపై ట్రాన్స్‌ఫార్మర్ పెట్టే విషయంలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా నిండు ప్రాణం పోయింది. ఈ సంఘటనతో దర్శి పట్టణం ఒక్కసారిగా ఉలిక్కి పడింది. ఆ వివరాల్లోకి వెళితే.. సందువారిపాలెం ప్రాంతంలోని చింతలపాలెం రోడ్డు వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. దాని కోసం దిమ్మె కూడా నిర్మించారు. అయితే, ఆ దిమ్మెపై ట్రాన్స్‌ఫార్మర్ పెట్టకుండా పక్కనున్న ఇనుప దమ్ము చక్రాలపై ఇనుప అడ్డీలు వేసి ట్రాన్స్‌ఫార్మర్ పెట్టి విద్యుత్ కనెక్షన్ ఇచ్చారు. ఆ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి నిత్యం విద్యుత్ సరఫరా చేస్తున్నారు. అక్కడే పేడదిబ్బలు వేయడంతో పాటు జన సంచారం కూడా ఉంటోంది. చిల్ల చెట్లు పెరిగి ట్రాన్స్‌ఫార్మర్ పరిసరాలు భయంకరంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో స్థానికుడైన ఉప్పు నారాయణ (27) అనే యువకుడు గేదెలకు మేత తీసుకొస్తుండగా, అతని చేతిలోని పచ్చి మేత దంట్లు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వైర్లకు తగిలాయి. దీంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. అతని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరై విలపించారు. నారాయణ తండ్రి ఉప్పు శ్రీను బేల్దారి మేస్త్రిగా పనిచేస్తున్నారు. నారాయణ ఏకైక సంతానం కావడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. తూర్పుచౌటపాలెం రోడ్డులోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద పాల కేంద్రం నిర్వహిస్తున్న నారాయణకు ఇంకా వివాహం కాలేదు. ఇదిలా ఉండగా, చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా విద్యుత్ అధికారులు అప్పటికప్పుడు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను దమ్ము చక్రాల పైనుంచి తీసి దిమ్మెపై పెట్టారు. నిర్లక్ష్యంగా వ్యవహరించి యువకుడి ప్రాణం తీసిన విద్యుత్ అధికారులపై చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో యువకుని మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు.

విద్యుదాఘాతంతో మరో యువకుడు మృతి...

అద్దంకి రూరల్: డీజే బాక్సులు విప్పుతుండగా విద్యుదాఘాతంతో మరో యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం అర్ధరాత్రి అద్దంకి మండలంలో చోటుచేసుకోగా, సోమవారం వెలుగులోకి వచ్చింది. మృతుడి బంధువులు తెలిపిన వివరాల మేరకు.. ముండ్లమూరు మండలం భీమవరం గ్రామానికి చెందిన నాగేంద్రబాబు (25) ఫంక్షన్‌లకు డీజే బాక్సులు ఏర్పాటు చేస్తుంటాడు. ఈ నేపథ్యంలో అద్దంకి మండలంలోని ధర్మవరం గ్రామంలో ఆదివారం రాత్రి డీజే ఏర్పాటు చేశారు. కార్యక్రమం అయిపోయిన తర్వాత డీజే బాక్సులు విప్పేందుకు పైకెక్కి విప్పదీస్తుండగా విద్యుదాఘాతానికి గురై కిందపడ్డాడు. స్థానికులు వెంటనే కారులో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి వైద్యశాలలోని మార్చురీలో ఉంచారు.

బీటెక్ విద్యార్థి ఆత్మహత్య

ఒంగోలు టౌన్:

ఓ ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య చేసుకుని మరణించాడు. పోలీసుల కథనం ప్రకారం.. కందుకూరుకు చెందిన వన్నం భాస్కర్ (19) స్థానిక ఓ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కాలేజీ ఆవరణలో ఉన్న హాస్టల్లోనే ఉంటున్నాడు. హాస్టల్‌పైన ఒక గది ఖాళీగా ఉంది. ఎవరూ లేని సమయంలో ఆ గదిలోకి వెళ్లిన భాస్కర్ కొబ్బరితాడుతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శని, ఆదివారాలు సెలవు కావడంతో ఈ విషయాన్ని కాలేజీ సిబ్బంది గమనించలేకపోయారు. సోమవారం రాత్రి పైగదిలోంచి దుర్వాసన వస్తుండడంతో అనుమానం వచ్చి వెళ్లి చూశారు. గదిలో నుంచి వాసన వస్తుండడంతో తలుపులు పగులగొట్టి చూశారు. అప్పటికే భాస్కర్ మృతి చెంది ఉన్నాడు. వెంటనే ఒంగోలు తాలూకా పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ విజయ కృష్ణ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఐదుగురికి జైలు శిక్ష

బేస్తవారిపేట:

మద్యం సేవించి వాహనాలు నడిపిన కేసులో ఐదుగురికి జైలు శిక్ష విధించినట్లు ఎస్సై ఎస్‌వీ రవీంద్రారెడ్డి సోమవారం తెలిపారు. కోర్టులో హాజరుపరిచిన ఐదుగురిలో నలుగురికి రూ.10 వేల జరిమానా విధించినట్లు చెప్పారు. ఒకరికి ఐదు రోజులు, మరొకరికి ఏడు రోజులు, ముగ్గురికి 20 రోజుల చొప్పున గిద్దలూరు అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ న్యాయమూర్తి కే భరత్‌చంద్ర శిక్ష విధించారని వివరించారు.

హత్య కేసులో నిందితుడిపై హత్యాయత్నం


ఒంటిపై కారంపొడితో బాపిరెడ్డి


బస్టాండ్‌లో విచారణ చేస్తున్న సీఐ సుబ్బారావు

మార్కాపురం: ఒక హత్య కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తి కోర్టులో వాయిదాకు హాజరై తిరుగు ప్రయాణంలో ఆర్టీసీ బస్టాండ్‌లో ఉండగా అతనిపై హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన సోమవారం మార్కాపురంలో జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం 2018 ఏప్రిల్‌లో ముండ్లమూరు మండలంలోని ఈదర గ్రామంలో క్రిష్ణపాటి వెంగళరెడ్డి కుమారుడు కొండారెడ్డి హత్యకు గురయ్యాడు. ఈ హత్యలో అదే గ్రామానికి చెందిన బండి బాపిరెడ్డి ప్రమేయం ఉన్నట్లు వెంగళరెడ్డి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో బాపిరెడ్డిని అరెస్టుచేసి కోర్టులో హాజరుపరచగా బెయిల్‌పై బయటకు వచ్చాడు. గ్రామంలో మళ్లీ గొడవలు జరగకుండా ఉండేందుకు పోలీసులు అప్పట్లో బాపిరెడ్డిని ఈదర నుంచి బయటకు పంపారు. ఆయన బ్రహ్మంగారి మఠంలో ఉంటున్నాడు. సోమవారం మార్కాపురం ఆరో అదనపు న్యాయ స్థానంలో వాయిదాకు హాజరై మఠం వెళ్లేందుకు బస్టాండ్‌కు వెళ్లి బస్సులో కూర్చుని ఉండగా వెంగళరెడ్డితో పాటు మరికొంత మంది వచ్చి తన కళ్లలో కారం చల్లి హత్య చేసేందుకు ప్రయత్నించారని దీంతో తాను గట్టిగా కేకలు వేస్తూ తప్పించుకున్నట్లు బాపిరెడ్డి తెలిపాడు. తనపై వెంగళరెడ్డి కారంపొడి చల్లి ఇనుపరాడ్డుతో దాడికి ప్రయత్నించాడని పట్టణ పోలీసు స్టేషన్‌లో బాపిరెడ్డి ఫిర్యాదు చేశాడు. నిందితులు పరారు కాగా పోలీసులు సీసీ టీవీలో పరిశీలించి వెంగళరెడ్డికి చెందిన కొంతమంది వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. సంఘటన జరిగిన ఆర్టీసీ బస్టాండ్‌కు సీఐ సుబ్బారావు, ఎస్సై సైదుబాబు చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కేజీబీవీ నుంచి పరారైన విద్యార్థిని

- పోలీసుల సాయంతో తిరిగి పాఠశాలకు..

పామూరు: స్థానిక కేజీబీవీలో పదో తరగతి చదువుతున్న ఓ విద్యార్థిని ఆదివారం రాత్రి పాఠశాల గోడ దూకి పరారైంది. విషయం తెలుసుకున్న కేజీబీవీ ప్రిన్సిపాల్ సృజన సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై కిషోర్‌బాబు తన సిబ్బందితో విచారించి విద్యార్థిని తన స్వగ్రామమైన మార్కాపురంలోని ఇంటికి వెళ్లినట్లు గుర్తించి తిరిగి కేజీబీవీకి తీసుకొచ్చి అప్పగించారు. విషయం తెలుసుకున్న ఎంఈఓలు పి.కోటిరెడ్డి, జి.కరుణకుమారి కేజీబీవీలో విచారణ చేపట్టారు. రాత్రివేళల్లో అప్రమత్తంగా ఉండాలని, లేకపోతే కఠిన చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు.

కూటమి పాలనలో చుండూరు తరహా దాడులు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రజక సంఘ నాయకులు

ఒంగోలు టౌన్: కూటమి పాలనలో చుండూరు తరహా దాడులు పునరావృతం అవుతున్నాయని ప్రకాశం జిల్లా రజక వృత్తిదారుల సంఘ ప్రధాన కార్యదర్శి రాయల మాలకొండయ్య ఆందోళన వ్యక్తం చేశారు. బాపట్ల జిల్లా కారంచేడులో రజక సామాజికవర్గానికి చెందిన మూగ యువతిపై జరిగిన దాడే ఇందుకు నిదర్శనమని అన్నారు. నగరంలోని ఎల్బీజీ భవన్‌లో రజక వృత్తిదారుల సంఘం, అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్‌ కం ఇస్త్రీదారుల సంఘం సంయుక్తంగా సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆనాడు కారంచేడు, చుండూరులో ఎస్సీ, ఎస్టీ మైనారిటీల మీద దాడులు చేసి కొంతమంది అమాయకులను అత్యంత క్రూరంగా హత్యలు చేశారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం బీసీలపై ప్రేమ ఉన్నట్లు మొసలి కన్నీరు కారుస్తోందని విమర్శించారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో బీసీలపై దాడులు ఎక్కువైపోయాయని, బీసీలకు రక్షణ కరువైందని మండిపడ్డారు. కూటమి పాలకులకు ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా కారంచేడు మూగ యువతిపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కేసును నిర్వీర్యం చేయడానికి ప్రయత్నించకుండా నిందితులను అరెస్టు చేయాలన్నారు. బలహీన వర్గాలకు చెందిన రజకులపై ఎటువంటి విచారణ చేయకుండానే కేసు నమోదు చేయడం దుర్మార్గమని, న్యాయవిరుద్ధమైన ఇలాంటి చర్యలు తగవని హితవు పలికారు. బీసీలకు సామాజిక రక్షణ కల్పించాలని, రాష్ట్రంలో ఎక్కడా ఎలాంటి దాడులు జరగకుండా కఠినంగా వ్యవహరించాలని కోరారు. సమావేశంలో రజక సంఘ జిల్లా నాయకులు అవులమంద రమణమ్మ, డాక్టర్ కృష్ణయ్య, మంచికలపాటి శ్రీనివాసులు, గుర్రపుశాల శ్రీను, శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సౌత్ ఇండియా రోల్‌బాల్ టోర్నమెంట్‌కు ఇద్దరు ఎంపిక


పిక్కిలి వరుణ్


ప్రత్తిపాటి సిదీక్ష

ఒంగోలు: సౌత్ ఇండియా రోల్‌బాల్ టోర్నమెంట్‌కు ఇద్దరు చిన్నారులు ఎంపికైనట్లు ప్రకాశం జిల్లా రోల్‌బాల్ ఇన్‌చార్జి ఏ. అనీల్‌కుమార్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 7 నుంచి 10 వరకు తణుకులో జరిగిన రాష్ట్ర స్థాయి క్యాంప్‌నకు ఎంపికైన వీరు అక్కడ అత్యంత ప్రతిభ కనబరిచి అండర్ 11 బాలుర విభాగంలో పిక్కిలి వరుణ్, బాలికల విభాగంలో ప్రత్తిపాటి సిదీక్షలు సౌత్ ఇండియా టోర్నమెంట్‌కు ఎంపికయ్యారు. వీరు సెప్టెంబర్ 6, 7 తేదీల్లో చెన్నైలో జరగనున్న సౌత్ ఇండియా పోటీల్లో పాల్గొంటారు.

ఎంపికైన ఇద్దరు చిన్నారులు ప్రకాశం జిల్లాకు చెందిన వారు కావడం తమకు మరింత సంతోషాన్ని కలిగిస్తుందని పేర్కొంటూ ఇద్దరు చిన్నారులను, కోచ్ గుర్రం అనీల్‌కుమార్‌లను ఆయన అభినందించారు.